సాక్షి
చిత్తూరు
శనివారం । 27 । జూలై । 2024



కలెక్టర్ దృష్టికి సమస్యలు
జిల్లాలోని మామిడి పరిశ్రమల యజమానులు కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. - 8లో



మీ అబ్బాయి మా కస్టడీలో..
ప్రస్తుతం మీ అబ్బాయి మా కస్టడీలో ఉన్నాడు.. అంటూ ఈ ఫొటోలో ఉన్న నంబర్ నుంచి ఒక ఫేక్ కాల్ పుత్తూరువాసికి వచ్చింది. - 8లో



బేబీ స్కాన్.. ఫేక్ రిపోర్ట్
అల్ట్రా స్కానింగ్‌లో బేబీ కదలికలను గుర్తించే పరిజ్ఞానం లేని పీజీ డాక్టర్లు కొందరు తప్పుడు రిపోర్టులు ఇస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

అతిథి అధ్యాపక ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

కార్వేటినగరం: అతిథి అధ్యాపక ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి తెలిపారు. కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులు బోధించుటకు తాత్కాలిక ప్రాతిపదికన అతిథి అధ్యాపకులు అవసరమన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఎం.కాంలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై కామర్స్‌లో పీహెచ్‌డీ, యూజీసీ నెట్ లేదా, ఏపీసెట్ లేదా ఏపీ స్లేట్ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. కంప్యూటర్ సైన్స్‌కు ఎంటెక్, కంప్యూటర్స్ సైన్స్, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్, ఎంసీఏ కోర్సుల్లో 55 శాతం మార్కులు కలిగి ఉండి, పీహెచ్‌డీ, యూజీసీ నెట్, లేదా ఏపీ సెట్ లేదా ఏపీ స్లేట్ పూర్తి చేసి బోధనలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అభ్యర్థులు జూలై 31వ తేదీ ఉదయం 11 గంటలకు కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో డెమో తరగతులు ఇవ్వడానికి హాజరుకావాలని కోరారు.

నేడు జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం

చిత్తూరు కలెక్టరేట్ : కలెక్టరేట్‌లో ఈ నెల 27న జిల్లా స్థాయి సఫాయి కర్మచారీ నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కలెక్టరేట్‌లో శనివారం ఉదయం సఫాయి కర్మచారీ చట్టం అమలుపై చైర్మన్, కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశం ఉంటుందన్నారు. ఇందులో కమిటీ సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె కోరారు.

దివ్యాంగులకు స్కాలర్‌షిప్‌లు

చిత్తూరు కలెక్టరేట్ : అర్హులైన దివ్యాంగులకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయనున్నట్లు జిల్లా దివ్యాంగుల శాఖ ఏడీ శ్రీనివాస్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని యాజమాన్యాల్లో 9, 10 తరగతులు చదువుతున్న అర్హులైన విద్యార్థులు ప్రీ–మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు అర్హులన్నారు. విద్యార్థులు ఆగస్టు 31లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటర్, ఆపై తరగతులు చదివే విద్యార్థులు(పోస్ట్ మెట్రిక్) స్కాలర్‌షిప్‌లు పొందవచ్చని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు డీటీటీ. ఛీఇటీఛీ. జౌఠి. జీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అవార్డులకు దరఖాస్తులు చేసుకోండి

జిల్లాలో అర్హత ఉన్న దివ్యాంగులు జాతీయ స్థాయి అవార్డులకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా దివ్యాంగుల శాఖ ఏడీ శ్రీనివాస్ అన్నారు. ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ చాటిన దివ్యాంగులకు జాతీయ అవార్డులు అందజేస్తారన్నారు. ఈ అవార్డులకు అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 31వ తేదీలోపు www. awards. gov. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నవోదయ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరవ తరగతి అడ్మిషన్లకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ దేవరాజు తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ 2025–26 విద్యాసంవత్సరంలో జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి అడ్మిషన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2024–25వ విద్యా సంవత్సరంలో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 01–05–2013 నుంచి 31–07–2015 మధ్య జన్మించిన వారై ఉండాలని తెలిపారు. సెప్టెంబర్ 16వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎంపిక పరీక్ష తేదీ జనవరి 18న నిర్వహిస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు www.navodaya.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ కోరారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. గురువారం అర్ధరాత్రి వరకు 61,699 మంది స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.55 కోట్లు సమర్పించారు. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 16 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఓ మహిళా.. డబ్బులివ్వు!

అదేమి చిత్రమో కానీ చంద్రబాబు ఎప్పుడు సీఎం అయినా ఏపీ పేద రాష్ట్రం అయిపోతుంది. వెంటనే వసూళ్ల పర్వం ఆరంభమవుతుంది. 2014లో విభజన రాష్ట్రం.. రెవెన్యూ లోటు అంటూ ప్రచారం చేసుకుని విరాళాలు సేకరించింది. 'రాజధానికి ఇటుక' అనే పేరు పెట్టుకుంది. ఇప్పుడేమో ఖజానా ఖాళీ అయిపోయిందంటూ మహిళా సంఘాల నుంచి వసూళ్లు ఆరంభించింది. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా దూసుకెళ్లింది. కరోనా రెండేళ్లపాటు వెంటాడినా వేలాది కోట్లు వెచ్చించి ప్రజల ప్రాణాలను కాపాడుకుంది. అదే చంద్రబాబు ప్రభుత్వం 2024లో అధికారంలోకి రాగానే మహిళా సంఘాల నిధులను తరలిస్తోంది.



- చిత్తూరు జిల్లాలోని 35,670 గ్రూపుల నుంచి వసూళ్లు
- ఇప్పటివరకు వసూలైన డబ్బును సీఎంకు అందజేసిన డీఆర్‌డీఏ
- గతంలో ఈ–ఇటుక పేరిట వసూలు చేసిందేమైందో?
- అమరావతి నిర్మాణానికి గ్రూపు డబ్బులేంటనే విమర్శలు

పలమనేరు: ఏపీ రాజధాని అమరావతి నిర్మాణం కోసం స్వచ్ఛంద విరాళాల కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం మళ్లీ మొదలు పెట్టింది. ఇందులో భాగంగా జిల్లాలోని మహిళా సంఘాల సభ్యుల నుంచి విధిగా వంద, వారికి ఇష్టమైతే ఆపై ఎంతైనా ఇవ్వచ్చు అంటూ వసూళ్ల పర్వం సాగుతోంది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు సైతం రాజధాని నిర్మాణం కోసం అంటూ ఈ– ఇటుక పేరిట ఆన్‌లైన్‌లో కోట్లాది రూపాయలను చందాల రూపంలో వసూలు చేశారు. ఆ నిధులు ఏమయ్యాయో, ఎక్కడికెళ్లాయో దేవుడికే తెలియాలి. తాజాగా జిల్లాలోని గ్రూపు మహిళ నుంచి వసూళ్లు సాగుతున్నాయి. ఇప్పటికే 74 శాతం దాకా వసూలైంది. ఇటీవల కుప్పానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు వసూలైన మొత్తం చెక్కును ఆయనకు డీఆర్‌డీఏ అధికారులు అందజేసినట్లు తెలిసింది. కేంద్రం నుంచి నిధులు రాబట్టి రాజధాని నిర్మాణం చేయాల్సింది పోయి ఇలా చందాలతో రాజధాని నిర్మాణం సాధ్యమయ్యే పనేనా అంటూ ప్రజలు విస్తుపోతున్నారు.

చిత్తూరు జిల్లా వసూళ్ల లక్ష్యం రూ.3.75 కోట్లు

చిత్తూరు జిల్లాలోని 31 మండలాల్లో కలిపి మొత్తం 35,670 దాకా డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. ఇందులో 3,75,006 మంది సభ్యులున్నారు. వీరినుంచి రూ.3.75కోట్లు వసూలు చేయాలని డీఆర్‌డీఏ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటిదాకా 2,80,491 మంది నుంచి రూ.2,80,49,100 వసూలు చేశారు. ఆమేరకు 74.80 శాతం టార్గెట్‌ను సాధించినట్లయింది. మిగిలింది ఈ నెలాఖరులోగా వసూలు చేసి రాజధాని నిర్మాణానికి పంపనున్నారు.

గతంలో 'నా ఇటుక–నా అమరావతి'

అమరావతి రాజధాని నిర్మాణం పేరిట చంద్రబాబు 2015 అక్టోబరు 15న నా ఇటుక– నా అమరావతి పేరిట ఈ– ఇటుక (ఈ–బ్రిక్) కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఈ నిధిలో ఎవరైనా ఆర్థిక సాయం చేయొచ్చనంటూ ముమ్మరంగా ప్రచారం చేశారు. ఒక్కో ఇటుకకు రూ.10 నుంచి కోటిదాకా ఆర్థిక సాయం చేయవచ్చని, దీన్ని రాజధాని నిర్మాణ నిధిలో ఉంచుతామని తెలిపారు. ఇందుకోసం జరిగే లావాదేవీలపై www. amaravathi. gov. in అనే వెబ్‌సైట్‌ను సృష్టించారు. ఇందులో నగదును మీ–సేవల ద్వారా, పోస్టాఫీసులు, మనీ ఆర్డర్, డీడీ, ఆన్‌లైన్, డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా పంపాలని సూచించారు. నగదు పంపిన వారు అదే సైట్‌లో విరాళ సర్టిఫికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. ముఖ్యంగా ఆదాయపు పన్ను మినహాయింపులుంటాయంటూ నమ్మబలికారు. చాలా మందికి ఇది వర్తించకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు త్వరలోనే వచ్చేస్తాయంటూ నమ్మించారు. ఏదేమైనా ఉమ్మడి జిల్లాలో వేలాదిమంది లక్షలాది రూపాయలను రాజధాని నిర్మాణానికి చెల్లించారు. ఈ విధంగా చిత్తూరు జిల్లా నుంచే కాకుండా ప్రపంచంలో ఉండే తెలుగువారినుంచి భారీగా విరాళాలను సేకరించారు. అయితే అప్పుడు చెల్లించిన విరాళాలు ఏమయ్యాయో, ఎక్కడికెళ్లాయో చంద్రబాబుకే తెలియాలని జనం చర్చించుకుంటున్నారు.

మనిషికి వంద ఇచ్చాం



"అమరావతి నిర్మాణానికంటూ మా వెలుగు సార్లు ఒక్కో సభ్యురాలి నుంచి వంద రూపాయలు కట్టించుకున్నారు. నలుగురికి ఏదయితే మాకూ అది అయిందని మేము కూడా ఇచ్చాం. రాజధాని నిర్మాణంలో మీ పేరు ఉంటుందని చిన్న సాయమే అని చెప్పారు. అందుకే మేము కూడా సరే అని ఇచ్చాం.
– శిరీష, కీలపట్ల, గంగవరం మండలం

సార్ మాట కాదంటే కుదురుతుందా?



గ్రూపుల్లో ఉండేవాళ్లంతా మనిషికి వంద కట్టమన్నారు. ఎందుకు సార్ అంటే మన రాజధాని కట్టేందుకు మీ సాయమేనని చెప్పారు. అందరూ కడుతున్నారంటే సరే సార్ అని చెప్పాం. మా ఊర్లోని అన్ని గ్రూపులోళ్లందరూ కట్టారంట అని చెప్పారు. ఇంతకు తప్ప మాకేమీ తెలియదు నాయనా.
– పార్వతమ్మ, కల్లుపల్లి, గంగవరం మండలం

పాల ఉత్పత్తి పెంపునకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లాలో పాల ఉత్పత్తి పెంపుదలకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. స్థానిక మ్యాంగో భవనంలో శుక్రవారం పశుసంవర్ధక శాఖ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రైతులు అత్యధికంగా వ్యవసాయంతో పాటు పశుపోషణపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని చెప్పారు. వర్షాభావ పరిస్థితుల్లో కూడా పాడి పరిశ్రమే జీవనాధారం అన్నారు. కావున పాడి పశువులు, జీవాల ఆరోగ్యంపై పశువైద్యాధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో నిత్యం వైద్యాధికారులు రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. పశువులకు ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే స్పందించి సకాలంలో వైద్యసేవలు అందించాలని సూచించారు. పాడి పశువుల ఆరోగ్యం, పాల ఉత్పత్తి పెంపునకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు చర్యలపై రైతులకు అవగాహన కల్పించి ఆదాయం పెంపునకు దోహదపడాలన్నారు. పాడి పశువులు మరింతగా అవసరమైన రైతులను గుర్తించి సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందించాలని చెప్పారు. డీఆర్‌డీఏ అధికారుల సహకారంతో డ్వాక్రా సంఘాల వారికి పశువుల పెంపకం, షెడ్ల ఏర్పాటు వంటి పథకాలకు అర్హులను గుర్తించాలని పేర్కొన్నారు. పాలిచ్చే పశువులపై పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. తక్కువ పాలిస్తున్న పశువులకు అవసరమైన పోషణ, చికిత్స, రైతులకు ఆర్థిక సాయం తదితర సమాచారాన్ని సేకరించాలన్నారు. సమావేశంలో పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సైనికుల సేవలు మరువలేనివి



కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న సైనికులను సత్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న సైనికుల సేవలు ఎన్నటికీ మరువలేనివని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని శుక్రవారం జిల్లా కేంద్రంలో మాజీ సైనికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో మాజీ సైనికులను కలెక్టర్ దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో వీరోచితంగా పోరాడిన అమరులందరినీ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పాకిస్థాన్‌కు భారత దేశానికి జరిగిన కార్గిల్ యుద్ధంలో 527 మంది భారత సైనికులు దేశం కోసం ప్రాణత్యాగం చేశారని తెలిపారు. ఆ యుద్ధంలో 1363 మంది సైనికులు గాయపడ్డారని చెప్పారు. గాయపడిన వ్యక్తుల్లో వినాయక రెడ్డి ప్రస్తుతం జిల్లా సైనిక సంక్షేమ అధికారి కార్యాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారన్నారు. ఆయన కార్గిల్ యుద్ధంలో అందించిన సేవలు గొప్పవని అభినందించారు. ఈ యుద్ధం 1999 మే 3న ప్రారంభమై 1999 జూలై 26 వరకు జరిగిందన్నారు. ఈ పోరులో పాకిస్తాన్‌పై భారత్ తిరుగులేని విజయాన్ని సాధించినందుకు గుర్తుగా జూలై 26న కార్గిల్ విజయ్ దివస్‌ను జరుపుకుంటున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో పాల్గొని విరమణ పొందిన 8 మంది సైనికులను కలెక్టర్ దుశ్శాలువతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి విజయశంకర్‌రెడ్డి, మాజీ సైనికులు పాల్గొన్నారు.

వంద రోజుల ఉపాధి తప్పనిసరి



కూనమరాజుపాలెంలో ఉపాధి హామీ పనులు పరిశీలిస్తున్న పీడీ

నగరి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డున్న ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాల్సిందేనని డ్వామా పీడీ ఎస్.రాజశేఖర్ తెలిపారు. నగరి క్లస్టర్ పరిధిలోని నగరి, నింద్ర, విజయపురం మండలాల్లో శుక్రవారం ఆయన ఏపీడీ టీఎస్ శోభన్ బాబుతో కలిసి ఉపాధి పనులను పరిశీలించి, కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తొలుత నగరి మండలం వేలావడి, బుగ్గ అగ్రహారం పంచాయతీలోని నీటి కుంట పనులను వారు పరిశీలించారు. నింద్ర మండలం కూనమరాజుపాలెం, అత్తూరు పంచాయతీల్లో చేపల కుంట పనులు చేస్తున్న కూలీల హాజరును పరిశీలించారు. విజయపురం మండలం ఆలపాకం పంచాయతీ ఓరూరు గ్రామానికి చేరుకొని పర్కులేషన్ ట్యాంక్ పనులను వీక్షించి కూలీలతో ముచ్చటించారు. పీడీ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో పూలతోట సాగు, పండ్లతోట పెంపకానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. తద్వారా ఉపాధి పనులను రైతులకు అనుసంధానం చేసినట్లు అవుతుందని ఆయన వెల్లడించారు. ప్రతి గ్రామంలో ఉపాధి పనులు చేపట్టాలని, అందులో నీటి కుంటలు, మినీ అమృత్ సరోవర్, పండ్ల తోటల పెంపకం, సరిహద్దు కందకాలు, పంట కాలువ పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. తద్వారా జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్క కుటుంబానికి 100 రోజులు ఉపాధి పనులు కల్పించి ఆదుకోవాలన్నారు. ఉపాధి పనులలో అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా చేపట్టాలని అధికారులు, సిబ్బందిని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ టీఎస్ శోభన్ బాబు, నగరి, విజయాపురం ఏపీఓలు కవిత, బబిత, ఈసీ శ్రీధర్, జేఈలు కిషోర్, మధుబాబు, సాంకేతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

చేతులెత్తి మొక్కుతున్నాం.. చదువుకోనివ్వండి!

'సీఎం సారూ.. మేము సంచార జీవులం. మా పెద్దోళ్లు రెక్కల కష్టం చేస్తేగానీ మా నాలుగు వేళ్లు నోట్లోకి వెళ్లవు. ఇప్పుడిప్పుడే నివాసాలు ఏర్పర్చుకుని స్థిరపడుతున్నాం. అలాంటి మాపైనే కొందరు కక్షగట్టారు. రాజకీయ వేధింపుల కారణంగా ఊరి నుంచి వెళ్లగొట్టారు. చదువుకు దగ్గరవుతున్న తరుణంలో మమ్మల్ని అర్థంతరంగా దూరం చేశారు. మాకు ఇంత అన్యాయం జరిగినా మా వెంట నిలిచే నీడలేదు. మా గోడు వినిపించే గొంతుక లేదు. మా మొర మీరైనా ఆలకించండి. మాకు రక్షణ కల్పించి.. మా కుటుంబాలను ఊరికి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టండి. మళ్లీ మేము చదువుకునేలా కరుణించండి మహాప్రభో..! అంటూ వారు చేతులు జోడించి అర్థిస్తున్నారు. చదువుకునే వయసులో వేధింపులొద్దని ప్రాధేయపడుతున్నారు.

- చిగురుటాకుల్లా షికారీలు!
- వైఎస్సార్‌సీపీకి ఓటేశారన్న అక్కసు
- ఊరి నుంచి తరిమేసిన టీడీపీ నేతలు
- ఒడిశాలో బిక్కుబిక్కుమంటున్న 30 కుటుంబాలు
- ఆగిన 20 మంది విద్యార్థుల చదువులు
- శ్రీకాళహస్తి మండలం, ఎంపేడు ఈశ్వరయ్య కాలనీలో ఘటన
- మూగబోయిన ప్రజాసంఘాలు
- బాబు పాలనలో బక్క జీవులపై ఆటవిక పెత్తనం



గ్రామ బహిష్కరణకు గురై ఒడిశా రాష్ట్రంలో బిక్కుబిక్కుమంటున్న షికారీ కుటుంబాలు

రేణిగుంట: శ్రీకాళహస్తి మండలం, ఎంపేడు గ్రామ పంచాయతీలోని ఈశ్వరయ్య కాలనీలో దాదాపు 70 కుటుంబాలు షికారీలు ఉన్నారు. వారంతా సంచార జీవులు. కాలానుగుణంగా ప్రభుత్వాలు ప్రోత్సహించడంతో ఇప్పుడిప్పుడే స్థిర నివాసాలు ఏర్పరుచుకుంటున్నారు. అయితే గత పాలనలో తమకు అనేక సంక్షేమ పథకాలు అందడమే కాకుండా తమలో ఒకర్ని గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీనికి అప్పటి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అండగా నిలిచారు. ఈ నేపథ్యంలో గత సార్వత్రిక ఎన్నికల్లో వారంతా వైఎస్సార్‌సీపీకి వెన్నుదన్నుగా నిలిచారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి శ్రేణులు చిగురుటాకులపై కక్షగట్టారు. వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేశారన్న అక్కసుతో ఈశ్వరయ్య కాలనీలోని గ్రామ సర్పంచ్‌తో సహా 30 షికారీ కుటుంబాలను గ్రామ బహిష్కరణ చేశారు. ఊర్లో ఉంటే చంపేస్తామని హెచ్చరికలు జారీచేశారు. దీంతో వారంతా తట్టాబుట్టా చేతబట్టుకుని జూన్ 7వ తేదీన ఊరు వదిలి వెళ్లిపోయారు. ఒడిశా రాష్ట్రానికి వెళ్లి అక్కడే తలదాచుకుంటున్నారు.

మూగబోయిన ప్రజాసంఘాల గొంతుక

గిరిజన తెగకు చెందిన షికారీలపై కక్షగట్టి ఇంత ఘోరంగా రాష్ట్రం విడిచి వెళ్లగొట్టినా.. వారిలో చదువుకునే పిల్లలు.. గ్రామ ప్రథమ పౌరురాలు సర్పంచ్ సుమతి ఉన్నా... కనీసం ప్రజాసంఘాలేవీ అటువైపు కన్నెత్తి చూడలేదు. కనీసం అది అన్యాయమని ఏ ఒక్కరూ నోరు మెదపకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. గిరిజన సంఘాల జాడ కూడా కానరాలేదు. టీడీపీ నాయకుల దుశ్చర్యల మూలాన వీరి జీవనాన్ని మళ్లీ సంచార(దేశ దిమ్మర్లు) విధానానికి ఉసిగొల్పేలా ఉన్నాయి.

ఆగిన పిల్లల చదువులు

ఈ 30 కుటుంబాలలో సుమారు 20 మంది చదువుకుంటున్న పిల్లలున్నారు. అర్ధంతరంగా వెళ్లిపోవడంతో పిల్లల చదువులు ఆగిపోయాయి. వీరిలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న బీ.భవానీ, 2వ తరగతి విద్యార్థి బీ.నవదీప్, 9వ తరగతి చదువుతున్న ఎం.అభిరామ్, ఎం.పార్థసారథి, 6వ తరగతి విద్యార్థులు బీ.హరీష్, ఎం.సింధు, ఆర్.అశ్విని, 3వ తరగతి విద్యార్థి బీ.హర్షింక్, ఇంటర్మీడియెట్ చదువుతున్న ఎం.తేజ, 4వ తరగతి విద్యార్థి ఆదర్శ, వినయ్, అరవింద్ తదితరులు తల్లిదండ్రులతో పాటు ఒడిశా రాష్ట్రంలో కాలం నెట్టుకొస్తున్నారు.

నకిలీ వైద్యులపై చర్యలు తప్పవు

- మండల వైద్యాధికారి బాలసుబ్రమణ్యం రెడ్డి హెచ్చరిక
- ఆర్‌ఎంపీ క్లినిక్‌లలో తనిఖీలు



క్లినిక్‌లో తనిఖీ చేస్తున్న బాలసుబ్రమణ్యంరెడ్డి

శ్రీరంగరాజపురం : ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యులపై చర్యలు తప్పవని మండల వైద్యాధికారి బాలసుబ్రమణ్యంరెడ్డి తెలిపారు. మండలంలోని 49 కొత్తపల్లిమిట్ట, శ్రీరంగరాజపురం క్రాస్ రోడ్డులో వెలిసిన ఆర్ఎంపీ, పీఎంపీ వైద్య శాలలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. అక్కడ మోతాదుకు మించిన స్టెరాయిడ్స్‌తో పాటు కాలం చెల్లిన మందులతో వైద్యం అందిస్తున్నట్లు గుర్తించారు. ఇక్కడ వైద్యం అందించేవారికి ఫార్మసిస్టు సర్టిఫికెట్ మాత్రమే ఉన్నట్లు తేలింది. అది కూడా రెన్యువల్ చేయలేదని నిర్ధారించారు. మరి కొన్ని క్లినిక్స్‌లో శస్త్ర చికిత్సకు వినియోగించే పరికరాలు, మందులు నిల్వ చేసినట్లు వెలుగులోకి వచ్చింది. రోగుల నుంచి ఫిర్యాదు రావడంతో ఈ తనిఖీలు చేపట్టినట్లు బాలసుబ్రమణ్యం రెడ్డి తెలిపారు. కనీస విద్యార్హత లేని వారు ఎంబీబీఎస్, ఎఫ్ఆర్‌సీ, హౌస్ సర్జన్ పేరుతో రోగులకు వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. రోగులకు వినియోగించన స్టెరాయిడ్స్‌ను, సూదులను రోడ్డుపక్కనే పడేస్తున్నారని స్థానికులు ఆయనకు ఫిర్యాదు చేశారు. నకిలీ డాక్టర్లు, కాలం చెల్లిన మందులతో వైద్యం అందిస్తున్న వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమాచారాన్ని జిల్లా వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లి అనుమతుల్లేని క్లినిక్‌లను మూసివేస్తామని ఆయన స్పష్టం చేశారు.

మధ్యవర్తిత్వంపై ముగిసిన శిక్షణ

తిరుపతి లీగల్: రాష్ట్ర న్యాయసేవ సంస్థ ఆధ్వర్యంలో రాయలసీమ జిల్లాల్లోని 30 మంది న్యాయమూర్తులకు మధ్యవర్తిత్వంపై నాలుగు రోజులుగా ఇచ్చిన శిక్షణ శుక్రవారంతో ముగిసింది. శిక్షణ ముగింపు కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్జి ఈ.భీమారావు హాజరయ్యారు. ఇద్దరు సీనియర్ ట్రైనర్లను జిల్లా జడ్జి భీమారావు, తిరుపతి మూడవ అదనపు జిల్లాజడ్జి ఎం.గురునాథ్ సన్మానించారు.



ట్రైనర్ హరీష్ దుడాని సన్మానిస్తున్న జిల్లా జడ్జి భీమారావు, న్యాయమూర్తులు

క్లుప్తంగా

కాలంచెల్లిన మందుల పంపిణీ



కాలం చెల్లిన మాత్రలు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది నిర్వాకం రోగులకు శాపంగా మారింది. ఇక్కడికి వచ్చే కాలం చెల్లిన మందులు అందజేస్తున్నారు. పచ్చికాపల్లం పీహెచ్‌సీకి వెళ్లిన గర్భిణీకి అక్కడ పనిచేస్తున్న ఫార్మసిస్టు కాలం చెల్లిన క్యాల్షియం మాత్రలు అందజేసిన సంఘటన సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. జూన్ 2024తో గడువు తీరిన మాత్రలు జూలైలో కూడా అందజేస్తున్నారని చెబుతున్నారు. ఈవిషయమై వైద్యాధికారిణి సురేఖను వివరణ కోరగా పీహెచ్‌సీలో అయితే వెంటనే విచారణ చేపట్టి సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు.

వ్యాపారి వేధింపులు భరించలేక ఆత్మహత్య


నాగరాజు (ఫైల్)

పలమనేరు: సిమెంట్ వ్యాపారి వేధింపులు భరించలేక ఓ తాపీమేస్త్రీ ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మండలంలో వెలుగుచూసింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. బంగారుపాళెం మండలం తగ్గువారిపల్లికి చెందిన నాగరాజు(40) తాపీమేస్త్రీ. ఓ ఇంటి నిర్మాణం కోసం బంగారుపాళెంలోని సిమెంట్ దుకాణ యజమాని సందీప్ వద్ద కొన్ని సిమెంట్ బస్తాలను అప్పు తీసుకొన్నాడు. దీనికి సంబంధించి డబ్బు చెల్లించినా మళ్లీ దుకాణదారుడు ఇవ్వలేదని చెప్పడంతో తీవ్రంగా మనస్తాపానికి గురయ్యాడు. ఇంట్లో ఎవరికీ చెప్పకుండా మూడురోజుల క్రితం ఎటో వెళ్లిపోయాడు. దీంతో కుటుంబీకులు గాలిస్తుండగా జగమర్ల అడవిలో ఎవరిదో శవం చెట్టుకు వేలాడుతోందని పశువుల కాపరుల ద్వారా సమాచారం వచ్చింది. వెంటనే అడవిలోకి వెళ్లి చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని కిందికి దించి పలమనేరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసును విచారిస్తున్నారు. మృతుని జేబులో తన ఆత్మహత్యకు కారణం సిమెంట్ దుకాణ యజమాని, అతని స్నేహితులే అని రాసినట్టు కుటుంబీకులు తెలిపారు. అయితే మృతికి గల కారణాలు పోలీసుల విచారణలో తేలనున్నాయి.

■ చిత్తూరు మండలానికి చెందిన రేఖ 5 నెలల గర్భిణి. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి రెగులర్ చెకప్‌కు వచ్చింది. 5వ నెల కావడంతో ఈ నెల 19న స్కానింగ్‌కు వెళ్లింది. అక్కడి పీజీ డాక్టర్లు, సిబ్బంది స్కానింగ్ చేసి రిపోర్ట్ ఇచ్చారు. బిడ్డ ముఖంలో చీలికలు కనిపిస్తున్నాయని, పెదవులపైన పెద్దగా కనిపించడం లేదని (గ్రహణ మొర్రి) అని రిపోర్ట్ ఇచ్చారు. అడ్మిట్ అయితే అబార్షన్ చేస్తామని చీటీ చేతిలో పెట్టారు. దీంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి, ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లారు. ఆ డాక్టర్ సూచనల మేరకు ప్రైవేటు స్కానింగ్ సెంటర్‌లో మళ్లీ స్కానింగ్ తీయించుకున్నారు. ఆ రిపోర్ట్‌లో బిడ్డకు ఎలాంటి సమస్యలు లేవని ఆ డాక్టర్ నిర్ధారించారు. ఆ ప్రైవేటు డాక్టర్ మరెవరో కాదు. ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న బాధ్యత కలిగిన అధికారి. దీంతో ఆ అధికారి ఈ తప్పిదం చేసింది ఎవరంటూ వివరాలు ఆరా తీశారు. జిల్లా ఆస్పత్రిలో పీజీ డాక్టర్లు చేసిన పనిగా గుర్తించి హెచ్చరించారు.

■ చిత్తూరు నగరానికి చెందిన జయకుమారి ఈనెల 12వ తేదీన తీవ్ర జ్వరంతో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారు. వైద్యుల సూచనల మేరకు సిబ్బంది జ్వర బాధితురాలికి అన్ని రకాల పరీక్షలు చేశారు. బ్లడ్ శ్యాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపారు. అయితే ఆ రిపోర్ట్‌లో ఏముందో పీజీ డాక్టర్‌కు తెలియకపోవడంతో ఫైల్‌ను పక్కన పెట్టేశారు. తీరా రోగి సహాయకులు ఆందోళనకు గురై ఏమైందో తెలుసుకోవాలని ప్రయత్నించారు. తెలిసిన ప్రభుత్వ వైద్యాధికారి దగ్గరకు వెళ్లారు. ఆ రిపోర్ట్‌ను పరిశీలించిన ఆ డాక్టరు, కంప్లీట్ బ్లడ్ పిక్చర్ టెస్ట్ చేశారు. అయితే గతంలో ఇచ్చిన రిపోర్టులో తప్పులు ఉన్నట్లు తెలిసి ల్యాబ్ సిబ్బందికి వెంటనే ఫోన్ చేశారు. రిపోర్ట్ తప్పుల తడకగా ఇచ్చారని ప్రశ్నించారు. దీంతో ల్యాబ్ సిబ్బంది తడబడి న్యూట్రోఫిల్స్ 87కు బదులు 57గా నమోదైందంటూ వివరణ ఇచ్చుకున్నారు.

బేబీ స్కాన్.. ఫేక్ రిపోర్ట్!

గర్భిణీ కడుపులో ఉన్న బేబీని స్కాన్ చేశారు. బిడ్డకు గ్రహణమొర్రి ఉందని అబార్షన్ చేయాలని డిసైడ్ చేసేశారు. దీంతో ఆ కుటుంబ సభ్యులు అయోమయంలో పడ్డారు. మరోసారి ప్రైవేటు ఆస్పత్రిలో స్కాన్ చేస్తే బేబీ ముఖ కదలికలు, అన్ని భాగాలు బాగున్నాయని చెప్పారు. ఇలాగే జ్వర నిర్ధారణ టెస్టులకు సంబంధించి ఫేక్ రిపోర్టు ఇచ్చినట్లు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో రోగులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. పీజీ డాక్టర్లకు సరైన పరిజ్ఞానం లేని కారణంగా ఇలాంటి సంఘటనలు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో నిత్యం వెలుగుచూస్తున్నాయి. అపోలో భాగస్వామ్యంతో నడుస్తున్న ఈ ఆస్పత్రిలో పాలన గాడి తప్పింది. ఇక్కడి వైద్యం ప్రజలకు శాపంగా మారింది.

- జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో తప్పుల తడకగా రిపోర్టులు
- పీజీ డాక్టర్ల అవగాహన లోపమే కారణం
- స్కానింగ్, ల్యాబ్ టెస్టులు గందరగోళం
- అయోమయంలో సీనియర్ డాక్టర్లు




స్కానింగ్ విభాగం, ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణికి ఇచ్చిన స్కానింగ్ రిపోర్ట్, ప్రైవేటు ల్యాబ్‌లో ఇచ్చిన గర్భిణి స్కానింగ్ రిపోర్ట్

కాణిపాకం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో స్కానింగ్, టెస్టులు, రిపోర్టులు గందరగోళం సృష్టిస్తున్నాయి. పీజీ డాక్టర్ల అవగాహన లోపమే ఇందుకు కారణమవుతోంది. తప్పుల తడక రిపోర్టులతో సీనియర్ డాక్టర్లు కూడా అయోమయానికి గురవుతున్నారు. తప్పుడు పరీక్ష ఫలితాలతో అమాయకులు బలవుతున్నారు.

చివరకు రెండో అభిప్రాయ సేకరణ తప్పనిసరవుతోంది. ఆస్పత్రిలో రోగుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. అయితే దానికి తగ్గట్టు సేవలు అందని ద్రాక్షగా మారుతున్నాయి. సమన్వయలోపంతో ఆస్పత్రి నిర్వహణ గాడితప్పుతోంది. ప్రతిరోజు ఓపీకి 1200 మందికిపైగా వస్తున్నారు. ఇన్‌పేషంట్‌లు 450మంది వరకు ఉంటున్నారు. వీరికి పడకలకు ఇబ్బంది లేకుండా ఆస్పత్రి నిర్వాహకులు 600 బెడ్ల వరకు సమకూర్చారు. ఇక ప్రధానంగా ప్రతి నెల ఎక్స్‌రేలు 4,200, స్కానింగ్‌లు 4,650, ఈసీజీలు 4100, ల్యాబ్‌లు 1.56 లక్ష టెస్టులు చేస్తున్నారు. ఇటీవల గర్భిణుల మెరుగైన వైద్య సేవల నిమిత్తం కొత్తగా టిఫా స్కానింగ్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు.

స్కానింగ్ విచిత్రం

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో స్కానింగ్ కోసం ఉదయం 9 గంటల కల్లా క్యూలో నిల్చుని టోకన్లు తీసుకోవాలి. లేకుంటే రేపు రండి అంటూ బోర్డు పెట్టేస్తున్నారు. ఈ స్కానింగ్‌లు కూడా మధ్యాహ్నం వరకు చేస్తారు. ఆపై సిఫార్సులు ఉంటే మాత్రం ఉత్తుత్తిగా చేసి పంపుతున్నారనే ఆరోపణలున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన గర్భిణులను కూడా ఇలాగే తిప్పించుకుంటున్నారు. జనవరిలో రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ స్కానింగ్ సెంటర్‌ను పరిశీలించి సాయంత్రం వరకు స్కానింగ్‌లు చేయాలని ఆదేశించారు. ఆ ఆదేశాలు మూన్నాళ్ల ముచ్చటగా మారాయి. మళ్లీ తలుపులేసి ముఖం చాటేస్తున్నారు. ఇక స్కానింగ్ రిపోర్ట్‌లన్నీ తప్పుల తడకగా ఉంటున్నాయి. వైద్యులు కూడా ఈ రిపోర్ట్‌లు చూసి షాక్ అవుతున్నారు. ఎన్నిసార్లు ఇలాంటి సంఘటనలను ప్రభుత్వ, అపోలో వైద్య నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. గర్భిణులకు ఇబ్బంది లేకుండా ప్రసూతి భవనంలో మరో స్కానింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్న అధికారులకు లేకపోవడం శోచనీయం.


బ్లడ్ శ్యాంపిల్స్ ఇచ్చేందుకు గుమికూడిన రోగులు

చర్యలు తీసుకుంటాం

స్కానింగ్ రిపోర్టుల్లో వస్తున్న తప్పిదాలపై కచ్చితంగా విచారిస్తాం. ల్యాబ్ టెస్టల లోపాలను ఆరా తీస్తాం. టెస్టులు, స్కానింగ్ రిపోర్ట్‌లో తేడాలొస్తే వెంటనే అధికారులను నేరుగా సంప్రదించవచ్చు. వెంటనే వారిపై చర్యలు తీసుకుంటాం. ఆస్పత్రి అధికారులు అందరితో మాట్లాడి ఇలాంటివి మళ్లీ జరగకుండా చూస్తాం.

-అరుణ్‌కుమార్, సూపరింటెండెంట్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు


విచారిస్తాం

ముందుకంటే ఇప్పుడు స్కానింగ్, టెస్టుల సంఖ్యను పెంచాం. ఎప్పటికప్పుడు అక్కడి సేవలను పరిశీలిస్తున్నాం. ఇబ్బందులుంటే వెంటనే పరిష్కరిస్తున్నాం. తప్పులు జరిగితే తన దృష్టికి తీసుకురండి. వీలైతే విచారిస్తాం. గర్భిణులకు ఇబ్బంది లేకుండా స్కానింగ్ సేవలను అందిస్తాం. సాయంత్రం వరకు పనిచేసేలా చూస్తాం.

-నరేష్‌కుమార్‌రెడ్డి, అపోలో నిర్వాహకులు

ఇదే దారిలో ల్యాబ్ టెస్టులు

ల్యాబ్ టెస్టు కూడా పేదలకు పరీక్ష పెడుతోంది. ల్యాబ్‌లోని సిబ్బంది ఇష్టానుసారంగా పరీక్ష ఫలితాలను నమోదు చేస్తున్నారు. కొన్ని శ్యాంపిల్స్‌ను పరీక్షించకుండానే ఫలితాలను నమోదు చేసి ఇచ్చేస్తున్నారు. జిల్లా ఆస్పత్రిలో ల్యాబ్ టెస్టులు 245కుపైగా చేసే వెసులుబాటు ఉంది. ఇందుకు తగ్గట్టు గత ప్రభుత్వం కూడా థైరాయిడ్‌తో మరి కొన్ని టెస్ట్‌లు చేసేలా పరికరాలను అందజేసింది. అయితే వాటిని వాడుకలోకి తెచ్చేందుకు అధికారులు శ్రద్ధ చూపడం లేదు. ప్రైవేటు ల్యాబ్‌లను బతికిస్తున్నారు.



తప్పుల తడకగా ఇచ్చిన ల్యాబ్ రిపోర్ట్

అక్రమ మద్యం ధ్వంసం

పలమనేరు: వివిధ కేసుల్లో పోలీసులు సీజ్ చేసిన రూ.12 లక్షలు విలువచేసే మద్యాన్ని స్థానిక కంపోస్టు యార్డు వద్ద శుక్రవారం జేసీబీతో ధ్వంసం చేశారు. మొత్తం 81 కేసులకు సంబంధించి, 1,758 లీటర్ల టెట్రా ప్యాకెట్లు, 5 కేసుల్లో పట్టుబడిన 29 లీటర్ల సారాను నాశనం చేసినట్టు సెబ్ సూపరింటెండెంట్ రవి తెలిపారు. ఇందులో పలమనేరు, గంగవరం సీఐలు చంద్రశేఖర్, చినగోవిందు పాల్గొన్నారు.

కాచి వడబోసిన నీరే తాగండి


పాఠశాల విద్యార్థులతో వైద్యాధికారి ప్రశాంత్

పూతలపట్టు : గ్రామీణ ప్రజలు కాచి, వడబోసిన నీటినే తాగాలని రాష్ట్ర వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్ విద్యార్థులకు సూచించారు. ఆయన జిల్లా వైద్యాధికారులతో కలిసి శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. డాక్టర్ ప్రశాంత్ విద్యార్థులతో మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి బాధ్యత గల పౌరులు అని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలన్నారు. వర్షా కాలంలో ఎక్కువగా వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ కాచి, వడపోసిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో మురుగు నీరు నిల్వలేకుండా చూడాలని చెప్పారు. విద్యార్థులు ఫాస్ట్‌ఫుడ్స్‌కు దూరంగా ఉండలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫ్లోరోసిస్ అధికారి కిరణ్‌నాయక్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మీ అబ్బాయి మా కస్టడీలో..

పుత్తూరు: ‘‘మేము పోలీస్ డిపార్ట్‌మెంట్ నుంచి మాట్లాడుతున్నాము..మీ అబ్బాయి మా కస్టడీలో ఉన్నాడు.. జైలుకు పంపకుండా ఉండాలంటే మేము అడిగిన మొత్తం ఈ నెంబర్‌కు వెంటనే ట్రాన్స్‌ఫర్ చేయండి!’’ అంటూ పుత్తూరు పట్టణానికి చెందిన ఆనంద్ అనే వ్యక్తికి వాట్సాప్ కాల్ వచ్చిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే పట్టణానికి చెందిన ఆనంద్ మొబైల్‌కు వాట్సాప్ కాల్ వచ్చింది. అందులోని ప్రొఫైల్ పిక్‌లో ఓ పోలీస్ అధికారి ఫొటో ఉంది. ఫోన్ చేసిన వ్యక్తి ఇంగ్లీష్, హిందీ భాషలో మాట్లాడాడు. పోలీస్ ఆఫీసర్‌ని మాట్లాడుతున్నానని, బెంగుళూరులో ఓ రేప్ కేసులో మీ అబ్బాయిని అరెస్ట్ చేశామని, అతన్ని జైలుకు పంపకుండా వదలిపెట్టాలంటే ఈ బ్యాంకు ఖాతాకు నగదు పంపాలని, ఈ విషయం ఎవరికీ చెప్పకూడదని చెప్పాడు. ఇది విన్న ఆనంద్ మా అబ్బాయి తప్పు చేసి ఉంటే జైలుకే పంపండి అని సమాధానం ఇచ్చాడు. అలాగే ఈ అరెస్ట్ విషయాన్ని పుత్తూరు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరాడు. దీంతో వెంటనే అవతలి వ్యక్తి వాట్సాప్ కాల్ కట్ చేశాడు. వాస్తవానికి ఆనంద్‌కు ఓ కుమార్తె మాత్రమే ఉంది. ఆమె బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. ఇలా ఇతర రాష్ట్రాల్లో పనిచేస్తున్న పిల్లల తల్లిదండ్రుల ఫోన్ నంబర్లు సంపాదించి, డబ్బు డిమాండ్ చేసే ఫోన్ కాల్స్ ఇటీవల కాలంలో ఎక్కువయ్యాయి. ఇలాంటి కాల్స్ వచ్చినప్పుడు తల్లిదండ్రులు ముందుగా తమ పిల్లలకు ఫోన్ చేసి వారితో మాట్లాడాలని, వెంటనే నగదు పంపించేసి మోసపోవద్దని పలువురు నిపుణులు సూచిస్తున్నారు.

కలెక్టర్ దృష్టికి ‘మామిడి’ సమస్యలు



సెల్ఫీ స్టాండ్ వద్ద ఫొటో తీసుకుంటున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని మామిడి పరిశ్రమల్లో ఉన్న దీర్ఘకాలిక సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు జిల్లా పండ్ల పరిశ్రమల సమాఖ్య కార్యదర్శి కట్టమంచి బాబిరెడ్డి అన్నారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లా కేంద్రంలో ఇన్‌ల్యాండ్ కంటైనర్ డిపో ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. సాలిడ్ వేస్ట్ ట్రీట్మెంట్‌లో బయోగ్యాస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని కోరినట్లు చెప్పారు. అనంతరం కలెక్టర్‌ను దుశ్శాలువతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు విద్యాసాగర్‌రెడ్డి, సమీర్‌శర్మ, ధనంజయనాయుడు, బషీర్, పాల్గొన్నారు.

ఒలింపిక్స్‌పై అవగాహన కల్పించండి

జిల్లా వ్యాప్తంగా ఒలింపిక్స్ క్రీడలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అన్నారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో ఒలింపిక్ క్రీడల సెల్ఫీ స్టాండ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి ప్యారిస్‌లో ప్రారంభమైన 30వ ఒలంపిక్స్ పోటీలను పురస్కరించుకుని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం ఐ చీర్ ఫర్ భారత్ సెల్ఫీ స్టాండ్ వద్ద కలెక్టర్ ఫొటో దిగారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కళ్లు గప్పి పరారీ

పలమనేరు: కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్న సెబ్ స్క్వాడ్ అధికారుల కన్నుగప్పి నిందితుడు పరారైన సంఘటన శుక్రవారం పలమనేరులో వెలుగుచూసింది. చిత్తూరుకు చెందిన సెబ్ స్క్వాడ్ సీఐ మాధవస్వామి ఆధ్వర్యంలోని బృందం శుక్రవారం ఉదయం గంగవరం మండలంలోని నాలుగురోడ్ల ప్రాంతంలో కర్ణాటకనుంచి బైక్‌పై మద్యం తెస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు. అతని నుంచి పది కేసుల మద్యాన్ని, బైక్‌ను స్వాధీనం చేసుకొని నిందితున్ని పలమనేరు సెబ్ అధికారులకు అప్పగించేందుకు వచ్చారు. స్థానిక సెబ్ స్టేషన్ వద్ద నిందితుడు మూత్ర విసర్జన కోసమని చెప్పి అక్కడి నుంచి ఉడాయించాడు. వెంటనే సిబ్బంది చుట్టుపక్కల వెతికినా లాభం లేకుండా పోయింది. దీంతో ఏం చేయాలో అర్థంగాక పట్టుబడిన మద్యాన్ని, బైక్‌ను స్థానిక సెబ్ స్టేషన్ వద్ద పెట్టి నిందితునికోసం గాలిస్తున్నట్టు తెలిసింది. పరారైన వ్యక్తి గతంలోనూ పలు కేసుల్లో నిందితుడైన బైరెడ్డిపల్లి మండలం లక్కనపల్లికి చెందిన నందాగా సెబ్‌అధికారులు తెలిపారు. ఈ విషయమై స్థానిక సెబ్ సీఐ సురేష్‌రెడ్డిని వివరణ కోరగా ఉదయం ఓ వ్యక్తితోపాటు సీజ్‌చేసిన మద్యాన్ని అప్పగించేందకు వస్తున్నామని స్క్వాడ్ అధికారులు చెప్పినమాట నిజమేనన్నారు. అయితే తమకు నిందితుడిని మాత్రం ఇంకా అప్పగించలేదన్నారు. స్క్వాడ్ టీం నిందితునికోసం గాలిస్తున్నట్టు తెలిసిందన్నారు.

ఆగిన ఆర్‌డీఎస్ పనులు

- 4 నెలలుగా నెలకొన్న స్తబ్దత
- టీడీపీ అనుకూల కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు కుట్ర


జీడీనెల్లూరులో సర్వే పనులు చేస్తున్న సిబ్బంది


చంద్రగిరిలో పోల్ టు పోల్ సర్వే చేస్తున్న సిబ్బంది (ఫైల్)

ఉమ్మడి చిత్తూరు జిల్లా సమాచారం

డివిజన్	సబ్‌స్టేషన్లు	ట్రాన్స్‌ఫార్మర్లు	వ్యవసాయఫీడర్లు
తిరుపతి ఆపరేషన్	33	661	94
తిరుపతి రూరల్	49	19354	120
పుత్తూరు	73	25597	197
చిత్తూరు అర్బన్	41	13819	107
చిత్తూరు రూరల్	24	14331	76
మదనపల్లె	47	23710	145
పీలేరు	50	20098	118
పుంగనూరు	108	31429	245

చిత్తూరు కార్పొరేషన్: ప్రతి పల్లెకు త్రీఫ్యూజ్ విద్యుత్ సరఫరా ఇవ్వాలని గత సంవత్సరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఉమ్మడి జిల్లాలో రూ.1,416 కోట్లతో ఆర్‌డీఎస్(రీవాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్) పథకాన్ని ప్రవేశపెట్టారు. గ్రామాల్లోని నివాసాలు, వ్యవసాయం, పరిశ్రమలకు మెరుగైన విద్యుత్ ఇవ్వడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఎన్నికల కోడ్‌తో ఆగిన పనులు కొత్త ప్రభుత్వం ఏర్పాటైన రెండు నెలలు కావస్తున్నా ప్రారంభం కాలేదు. గత 4 నెలలుగా ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. టీడీపీ అనుకూల కాంట్రాక్టర్లకు పనులు అప్పగించాలనే ఉద్దేశంతో పనులు ఇంకా ప్రారంభం కాలేదన్న విమర్శలు వస్తున్నాయి.

పల్లెలకు త్రీఫ్యూజ్ విద్యుత్

గ్రామాల్లోని నివాసాలు, వ్యవసాయం, పారిశ్రామిక రంగాలకు త్రీ ఫ్యూజ్ సరఫరా ఇవ్వాలనేది ఈ ఆర్డీఎస్ పథకం లక్ష్యం. గ్రామాలకు ఇప్పటి వరకు సింగిల్ ఫ్యూజ్ విద్యుత్ లైన్లు ఉన్నాయి. ఫలితంగా పరిమిత వ్యవధిలోనే మంచినీటి సరఫరా సాగుతోంది. చాలా గ్రామాలు ఏళ్ల తరబడి లోఓల్టేజీ సమస్యను ఎదుర్కొంటున్నాయి. ఇంతవరకూ జిల్లా, మండల కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లో మాత్రమే త్రీఫ్యూజ్ విద్యుత్ సరఫరా అవుతోంది. ఈ కారణాలతోనే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు పట్టణాలు, నగరాలకు వెళ్లి పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారు. పల్లెల్లో విరివిగా స్థలాలున్నప్పటికీ పరిశ్రమల ఏర్పాటుకు ఆసక్తి చూపడంలేదు. ఈ సమస్యలన్నింటినీ అధిగమించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆర్డీఎస్ పనులు గత ఏడాది ప్రారంభమయ్యాయి. దీనికోసం గత ప్రభుత్వం నిధులను సద్వినియోగం చేస్తూ వచ్చింది. ప్రాజెక్టులో భాగంగా తొలి దశలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆర్‌డీఎస్ పథకంలో మొత్తం 890 గ్రామీణ ఫీడర్లలో సర్వే పూర్తి చేశారు. పలు డివిజన్లలో పనులు ప్రారంభించారు.

మెరుగైన విద్యుత్

ప్రధానంగా ఆర్‌డీఎస్ ద్వారా త్రీ ఫ్యూజ్ సరఫరా చేసి, లోవోల్టేజ్ సమస్యలను పరిష్కరించి, మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేయనున్నారు. ఈ స్కీము ద్వారా గ్రామాల్లో 24 గంటలూ నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించనున్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.1,416 కోట్లు కేటాయించింది. ఈ నిధుల్లో 60 శాతం కేంద్రం గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా ఇస్తోంది. మిగిలిన 40 శాతం కూడా ఇంటర్నల్ గ్రాంట్‌గా విడుదల చేసింది. గత సంవత్సరం ఈ పనులు ప్రారంభించారు. వ్యవసాయ రంగానికి ప్రత్యేక ఫీడర్లతో విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరా చేసే సమయంలో చిన్న, మధ్యతరహా, కుటీర పరిశ్రమలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. అలా కాకుండా ఆర్డీఎస్ పనులు పూర్తయితే వ్యవసాయంతోపాటు పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ అందించవచ్చు.